క్లుప్తంగా

పకడ్బందీగా 'కోడ్' అమలు

చౌడేపల్లె: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు కనపడకుండా పేపర్ అంటించారు. బస్టాండ్ కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి విగ్రహాలకు ముసుగులు వేశారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన హోర్డింగ్‌లను తొలగించారు. ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శివయ్య

పెద్దపంజాణి: స్థానిక ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ శివయ్య సోమవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద పక్కాగా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, సర్వేయర్ ఆంజనేయులు, వీఆర్‌ఓ సుధాకర్ పాల్గొన్నారు.

రూ.2.63 లక్షలకు చెరువుల వేలం


వేలం నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ గఫూర్

సోమల: కందూరు పంచాయతీలోని చేపల చెరువులను రూ.2.63 లక్షలకు వేలం వేసినట్లు ఈఓపీఆర్డీ ఎస్‌ఏ గఫూర్ సాహెబ్ తెలిపారు. సోమవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ బాషా మసూద్ అధ్యక్షతన వేలం చేపట్టగా గత ఏడాది కంటే అదనంగా రూ.76,300 ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జైశంకర్, వైఎస్సార్‌సీపీ నేతలు నాగేంద్ర, రామనారాయణ పాల్గొన్నారు.

18న మల్లేశ్వరగుట్టలో పూజలు

పుంగనూరు: పెద్దపంజాణి మండలం చింతలపల్లె సమీపంలోని మలేశ్వరస్వామి గుట్టలో ఈనెల 18వ తేదీన శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉదయం స్వామివారికి అభిషేకం, హోమం జరిపించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గంగవరం: మండలంలోని కలగటూరు వద్ద కౌండిన్య నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్ నేత మృతికి సంతాపం


సుమిత్రమ్మ (ఫైల్)

బైరెడ్డిపల్లె: మండలంలోని కాంగ్రెస్ నేత ఎస్.సుమిత్రమ్మ (97) ఆదివారం రాత్రి కన్నుమూశారు. ఆమె మృతికి డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి తదితరులు సంతాపం తెలిపారు.

అజ్మీర్ దర్గాలో ప్రార్థన


ప్రార్థన చేస్తున్న రజీ, నజీర్ అహమ్మద్

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని కోరుతూ పట్టణానికి చెందిన ముస్లింలు సోమవారం అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో పుంగనూరు మరింత ప్రగతి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రజీ, నజీర్‌అహమ్మద్ పాల్గొన్నారు.

హంసపై శివపార్వతుల విహారం

యాదమరి: ఏకాంబరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం హంస, వృషభ వాహనాలపై విహరించారు. ఉదయం మూలస్థానంలో వెలసిన శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేసి హంస వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం వృషభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కైంకర్యాలకు యాదమరికి చెందిన దేవీరవిచంద్రన్, శాంతమ్మ, శ్రీనివాసపిళ్లై ఉభయదారులుగా వ్యవహరించారు.

క్షణ క్షణం.. భీకరి భయం


కీలపట్ల వద్ద సంచరిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్)

- ఏనుగుల సంచారంపై రైతుల ఆందోళన
- జనావాసాల్లోకి వచ్చేస్తున్న గజరాజులు
- యథేచ్ఛగా పంటల ధ్వంసం
- వ్యవసాయానికి వెనక్కితగ్గుతున్న అన్నదాతలు

పలమనేరు ఫారెస్ట్ పరిధిలోని మండలాల్లోని రైతులు ఏనుగుల దాడితో బెంబేలెత్తుతున్నారు. పంటలు సాగు చేసేందుకు హడలిపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండిస్తే చేతికందే దశలో గజరాజులు తొక్కి నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌండిన్య అభయారణ్యం నుంచి ఏనుగులు వెలుపలికి రాకుండా నిర్మించిన సోలార్ ఫెన్సింగ్, ట్రెంచ్‌లు నిరుపయోగంగా మారడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలు నేటికీ వెంటాడుతున్నాయని మండిపడుతున్నారు. గజభీభత్సానికి భయపడి మాగాణి భూములను సైతం బీడు పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.


ఏనుగులు ధ్వంసం చేసి టమాట పంట (ఫైల్)

గంగవరం: కౌండిన్య ఎలిఫెంట్ శాంచరీ ప్రారంభించి మూడు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఏనుగుల కట్టడి సమస్య తీరలేదు. తరచూ ఏనుగుల దాడితో పంట నష్టపోతుండడంతో పలువురు రైతులు వ్యవసాయం చేసేందుకు వెనక్కు తగ్గుతున్నారు. కొందరు పంటలను సాగుచేయకుండా వదిలేశారు. అభయారణ్యం నుంచి ఏనుగులు బయటికి రాకుండా నిర్మించిన సోలార్‌ఫెన్సింగ్, గత టీడీపీ ప్రభుత్వంలో తవ్వించిన ఎలిఫెంట్ ట్రెంచ్‌లను ఏనుగులు ధ్వంసం చేసి యథేచ్ఛగా బయటకు వచ్చేస్తున్నాయి.

ఇక్కడే పంట నష్టం ఎక్కువ

గంగవరం మండలంలోని గాంధీనగర్, కీలపట్ల, కొత్తపల్లె, మేలుమాయి, కల్లుపల్లె, పలమనేరు మండలంలోని టీఎస్ అగ్రహారం, టి.వడ్డూరు, పెంగరగుంట, సముద్రపల్లె, మండిపేటకోటూరు, కరిడిమొడుగు, బైరెడ్డిపల్లె మండలంలోని నెల్లిపట్ల, వెంగంవారిపల్లె, వి.కోట మండలంలోని తోటకనుమ, శ్యామ, చింతమాకులపల్లెతో పాటు కుప్పం నియోజకవర్గంలోని పది పంచాయతీలు, పెద్దపంజాణి మండలంలోని నాలుగు పంచాయతీల్లో ఏనుగుల కారణంగా పంటలకు అధికంగా నష్టం వాటిల్లుతోంది. ఈ గ్రామాల్లోని రైతులు పంటలు పండించాలంటేనే హడలిపోతున్నారు. సాగు చేయకుంటే కుటుంబ పోషణ జరగని పరిస్థితిలో తల్లడిల్లుతు న్నారు. రాత్రిపూట పొలాల వద్దకు కాపలాగా కూడా ఏనుగుల భయంతో వెళ్లలేకపోతున్నారు. పశువులు, మేకల కాపరులు అడవిలోకి వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఇక పొలాల వద్ద కాపురాలుండే రైతులకు నిద్రలేని రాత్రులు తప్పడం లేదు. పొలాల వద్ద పాకల్లో కట్టిన పశువులను సైతం ఏనుగులు చంపేస్తున్నాయి.

గత ప్రభుత్వ తప్పిదాలు

ఏనుగులను కట్టడి చేయడంలో గత టీడీపీ ప్రభుత్వం పలు తప్పిదాలు చేసింది. ఫారెస్ట్ సరిహద్దులో కేవలం మూడడుగుల ట్రెంచ్‌లు తవ్వించడంతో వాటిని ఏనుగులు సులువుగా దాటేస్తున్నాయి.


రైతులు బీడు పెట్టిన భూములు

కొన్ని చోట్ల ట్రెంచ్‌లు తవ్వకుండా వదిలేశారు. దీంతో ఏనుగులు కందకాలను దాటి సునాయాసంగా వచ్చేస్తున్నాయి. తూతూమంత్రంగా ట్రెంచ్‌లు తవ్వడం కోసం అప్పట్లో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారు. దీనికి తోడు గతంలో నిర్మించిన సోలార్‌ఫెన్సింగ్ కొన్ని చోట్ల దెబ్బతింది. కొన్ని చోట్ల బ్యాటరీలు పనిచేయడంలేదు. ఇవన్నీ రైతుల పాలిట శాపంగా మారాయి.

భయపడుతూనే సాగు



వ్యవసాయం చేయాలంటే వెనకడుగు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.లక్షలు వెచ్చించి సాగు చేస్తే ఏనుగుల తొక్కి నాశనం చేసేస్తున్నాయి. ఒక రోజు నా భార్యను సైతం ఏనుగు తరుముకుంది. అదృష్టం బాగుంటబట్టి ప్రాణాలు దక్కాయి. నిత్యం భయపడుతూనే సాగు చేసుకుంటున్నాం.

– గోవిందయ్య, రైతు, బూడిదపల్లె

నిద్రలేని రాత్రులు ఎన్నో..



ఏనుగుల బెడదతో నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపాం. మా పశువుల పాకపై పడి వాటిని దారుణంగా గాయపరిచాయి. పంటలనైతే చేతికి వస్తోంది కదా అనుకునే లోపే తొక్కి నాశనం చేసేస్తున్నాయి. పటిష్టమైన సోలార్ ఫెన్సింగ్ వేస్తే తప్ప సమస్య తీరదు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– దేరంగుల సుబ్రమణ్యన్ రైతు, గాంధీనగర్

హ్యాంగింగ్ ఫెన్సింగ్ ఏర్పాటు



ఏనుగులను అదుపు చేసేందుకు సోలార్ హ్యాంగింగ్ ఫెన్సింగ్‌ను అడవి చుట్టూ ఏర్పాటు చేస్తున్నాం. గతంలో రెండు కిలోమీటర్ల మేర ఈ తరహా ఫెన్సింగ్ వేసి ఏనుగులన కట్టడి చేశాం. ఈ తీగల్లో 9.9 కేవీ సోలార్ విద్యుత్ సరఫరా అవుతుంది. దీన్ని ఏనుగులు కూడా ధ్వంసం చేయలేవు.

– నయీమ్ అలీ, ఫారెస్ట్ రేంజర్, పలమనేరు

శివాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో శివపార్వతులు

చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలో ఉన్న అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కర్ణాటక మద్యం విక్రయాలపై ఫిర్యాదు

పలమనేరు: గ్రామీణ ప్రాంతాల్లో కర్ణాటక మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని గొబ్బిళ్లకోటూరు, గడ్డూరు వాసులు సోమవారం సెబ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదివరకు మద్యం తరలిస్తూ పట్టుబడిన వారే మరింతగా రెచ్చిపోయి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి కర్ణాటక మద్యం విక్రయాలను అడ్డుకోవాలని పేర్కొన్నారు.

రూ.5.55 లక్షలకు వాహనాల వేలం

పుంగనూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన 39 వాహనాలను సోమవారం పట్టణంలోని ఎస్‌ఈబీ స్టేషన్‌లో వేలం వేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. వేలం ద్వారా మొత్తం రూ.5.55లక్షల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు


సోషల్ మీడియా కన్వీనర్లను సత్కరిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప సూచించారు. సోమవారం బైరెడ్డిపల్లెలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోషల్‌మీడియా కన్వీనర్లను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్లు పీరూసాహెబ్, జనార్దన్, రెడ్డిప్రసాద్, వినోద్‌కుమార్, సచివాలయ కన్వీనర్ మహేష్ పాల్గొన్నారు.

16న మంత్రి పెద్దిరెడ్డి పర్యటన


సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఈ నెల 16వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పులిచెర్లలో నిర్వహించనున్న గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశంలో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సమావేశానికి ప్రజాప్రతినిధులందరూ తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, సచివాలయ కన్వీనరు ముర్వత్ బాషా, నాధమునిరెడ్డి, గోవిందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మధు, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర ఆలయానికి శివరాత్రి శోభ


అగస్త్యేశ్వరస్వామి ఆలయం

పుంగనూరు: పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ సంరంభం సోమవారం ప్రారంభమైంది. 22 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆలయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అలాగే పట్టణంలోని కాశీవిశ్వేశ్వర ఆలయం, భోగనంజుండేశ్వరస్వామి ఆలయం, భీమగానిపల్లెలో గల భీమేశ్వరాలయం, పుదిపట్లలోని పంచలింగేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి పూజలు ప్రారంభించారు.

పిల్లలను బడిలో చేరుద్దాం



పుంగనూరు: కౌన్సెలింగ్ ఇస్తున్న వెంకటరమణారెడ్డి, పలమనేరు: మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పుంగనూరు: బడి బయటి పిల్లలను బడిలో చేర్పించడం బాధ్యతగా తీసుకోవాలని సమగ్రశిక్ష జిల్లా అడిషినల్ కో–ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ డంపింగ్‌యార్డ్ వద్ద కార్మికులతో ఆయన మాట్లాడారు. పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పిల్లలకు మూడు జతల యూనిఫాం, షూ, పుస్తకాలు, బ్యాగులు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎల్‌ఎస్‌ఓ అజయ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ వెంకట్రమణారెడ్డి, సీఆర్పీలు నారాయణస్వామి, తేజ, రమణ, శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు దివ్య, రాజ్‌కుమార్, భార్గవి, శ్యామల పాల్గొన్నారు.

పలమనేరు: బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంఈఓ లీలారాణి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో బడిపిల్లల సర్వేకోసం మండల కన్వర్జెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్లలోపు ఉన్న బడిబయటి పిల్లలను గుర్తించాలన్నారు. కమిటీలో తహసీల్దార్, ఎంపీడీవో, సీఆర్పీ, ఐసీడీఎస్, హాస్టల్ వార్డెన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బాధ్యులుగా ఉంటారని తెలిపారు. బడి బయట పిల్లలను ఎప్పటికప్పుడు పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విద్యాసాగర్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ ప్రభుత్వోద్యోగి మృతి


మదన్‌మోహన్‌రాజు (ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి జూనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రాజు (38) చెన్నైలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన గత నెలలో విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. మదన్‌మోహన్‌రాజు మృతికి వైద్యాధికారి యశ్వంత్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్, సభ్యులు సత్యనారాయణ, ఇనాయతుల్లాషరీఫ్, జానకి సంతాపం తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం


లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజా

సోమల: ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగరాజా ఆదేశించారు. సోమవారం భారతం మిట్టలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. ఉగాది నాటికి గృహప్రవేశం చేయించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణికంఠ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

పలమనేరు: సోషల్ మీడియాలో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సంఘం నాయకులు కోరారు. సోమవారం ఈమేరకు సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఈశ్వర్, భువనేశ్వరి, ఓబుల్‌రాజు పాల్గొన్నారు.

వేడుకగా వేప-రావి చెట్లకు వివాహం


కల్యాణం జరిపిస్తున్న వేదపండితుడు

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ జంగాలపల్లెలో రావిచెట్టు, వేపచెట్టుకు వేడుకగా వివాహం జరిపించారు. గ్రామానికి చెందిన శంకరప్ప కుటుంబీకుల ఆధ్వర్యంలో వేదపండితుడు ఆనందాచార్యులు ముందుగా నాగదేవతల విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శరవేగంగా డబుల్ రోడ్డు నిర్మాణం



గతంలో దారి దుస్థితి, ప్రస్తుతం నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ మార్తువారిపల్లె నుంచి బూరగమంద క్రాస్ వద్ద డబుల్ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. తిరుపతి–పుంగనూరు ప్రధాన రహదారికి కనెక్టింగ్‌గా సుమారు 10 కిలోమీటర్ల మేర రూ.10కోట్ల వ్యయంతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో మంజూరైన ఈ రోడ్డు పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొళాయిల ధ్వంసంపై ఫిర్యాదు


చౌడేపల్లె హైస్కూల్‌లో ధ్వంసమైన కొళాయిలు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దాహార్తిని తీర్చే తాగునీటి కొళాయిలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం ఈ విషయం గుర్తించిన విద్యార్థులు వెంటనే ప్రధానోపాధ్యాయుడు వెంకటశివయ్య దృష్టికి తీసుకువచ్చారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో పలువురు పాఠశాల ఆవరణలోనే మద్యం సేవిస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పాఠశాలకు వాచ్‌మన్‌ను నియమించేందుకు ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

క్రీడలతో శారీరక దృఢత్వం


టోర్నీ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందుతుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సాయిరామ్ టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోషియేషన్ వారు నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వీరాంజనేయస్వామి పుష్పపల్లకిసేవ రోజున ఏటా ఆనవాయతీగా టోర్నమెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. టోర్నీ విజేతలకు రూ.55వేలు, రన్నర్స్‌కు రూ.35వేలు, మూడో బహుమతిగా రూ.20వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు అందించనున్నట్లు వెల్లడించారు.

వైభవంగా పుష్ప పల్లకీసేవ


ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి

వి.కోట: వీరాంజనేయుని ఆలయంలో స్వామివారికి పుష్పపల్లకీ సేవను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం సింగిల్ విండో చైర్మన్ ధవనం భక్త ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి స్వామివారిని పుష్పపల్లకిలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ధర్మకర్త జీఎం సుబ్బన్న, ఎంపీపీ యువరాజు, సర్పంచ్ పీఎస్ లక్ష్మి, ఉప సర్పంచ్ అక్మల్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, నాయకులు గోపిరెడ్డి, హరికుమార్, కృష్ణమూర్తి , సురేంద్రగౌడ్, రమేష్ పాల్గొన్నారు. సీఐ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.


పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు